కొన్నింటిని ఓర్చుకో
కొందరిని చూసి నేర్చుకో
ఎంత మనవాళ్లు అనుకున్నా
ఎవరు ఏ క్షణం ఎలా
మారిపోతారో
ఎవరికీ తెలియదు..!

RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY
తెలుగు దిన పత్రిక...

గురువారం, 22 జనవరి 2026 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 03 | సంచిక 71

# తెలంగాణకు 1,000 కోట్ల పెట్టుబడులు

## దావోస్‌లో సర్కార్ కీలక ఒప్పందం

**దావోస్, జనవరి 21:** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 2026 సదస్సు సందర్భంగా అమెరికాకు చెందిన సర్గడ్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్ రెడ్డితో ఆ సంస్థ సీఈఓ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ముందుకు వచ్చింది. రాబోయే 3 నుంచి 5 సంవత్సరాల్లో రూ.1,000 కోట్ల పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఎమర్ఓ కేంద్రాన్ని వరంగల్ లేదా ఆదిలాబాద్?లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. దీంతో రాష్ట్రం.. విమానయాన, ఏరోస్పేస్ రంగాల్లో మరింత బలోపేతమయ్యే అవకాశం ఉంది. బ్లైజ్ కంపెనీతో ఎంవోయూ.అలాగే.. కాలిఫోర్నియా కేంద్రంగా ఉన్న బ్లైజ్‌కంపెనీతో మరో ఎంవోయూ కుదిరింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వేదికపై సీఎం రేవంత్ రెడ్డితో బ్లైజ్ సీఈఓ దినాకర్ మునగాలా సమావేశమయ్యారు. హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎనర్జీ రంగాల్లో పైలట్ ప్రాజెక్టులపై చర్చలు జరిగాయి. తక్కువ విద్యుత్ వినియోగంతో హార్డ్‌వేర్, ఫుల్-స్టాక్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో బ్లైజ్ సంస్థ అగ్రగామి. ఈ ఒప్పందం ద్వారా హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ సెంటర్ విస్తరణకు బ్లైజ్ నిర్ణయం తీసుకుంది. ఈ ఒప్పందంతో తెలంగాణలో ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్,రంగాలకు ఊపిరి లభించనుంది. తెలంగాణను డేటా సెంటర్ హబ్‌గా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



తెలంగాణ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం కానుందని మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు.కాగా.. సీఎం రేవంత్.. జనవరి 20 నుంచి 23 వరకు దావోస్‌లోని డబ్ల్యూఈఎఫ్ 2026 సదస్సులో పాల్గొననున్నారు. జనవరి 19న మేడారంలో సమ్మక్క-సారలమ్మ దేవాలయాన్ని సందర్శించి పూజలు చేసిన అనంతరం, హైదరాబాద్ నుంచి స్విట్జర్లాండ్?కు బయలుదేరారు సీఎం. జ్యూరిచ్ ఎయిర్?పోర్ట్?లో ఆయనకు తెలంగాణ దయాస్పోరా సభ్యులు ఘన స్వాగతం పలికారు. పర్యటనలో సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల మంత్రులు డి.శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీలు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి తదితరులు ఉన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను ప్రపంచ నాయకులు, సీఈఓల ముందు ప్రదర్శించడమే ప్రధాన లక్ష్యంగా రేవంత్ దావోస్ పర్యటన కొనసాగుతోంది.

### 26-26 ఉగ్ర కుట్రకు ప్లాన్ నిఘా వర్గాలు

# అప్రమత్తం

**న్యూఢిల్లీ:** గణతంత్ర దినోత్సవాన్ని లక్ష్యంగా చేసుకుని భారత్‌లో ఉగ్రదాడులు జరిగే అవకాశాలున్నాయని నిఘా వర్గాల తాజా సమాచారం. ఈ సమాచా రంతో ఢిల్లీలో భద్రతా బలగాలు బుధవారం నాడు అప్రమత్త్తమయ్యాయి. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస ఈ ఉగ్రదాడులకు సహకరిం చనున్నట్టు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. జనవరి 26న దేశంలోని పలు ప్రాంతాల్లో జరిపే ఈ దాడులకు '26-26' అనే కోడ్ నేమ్ పెట్టినట్టు తెలిపాయి.దేశంలోని పలు ఆలయాలు, నగరాలతో పాటు అయోధ్యలోని రామాలయం, జమ్మూలోని రఘునాథ్ ఆలయం ఉగ్రవాదుల టార్గెట్‌లో ఉన్నట్టు భద్రతా బలగాలు తెలిపాయి. పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ (జీవవీ), పంజాబ్? బేస్డ్ గ్యాంగ్?స్టర్లతో ఐఎస ఈ ఉగ్రదాడులకు ప్లాన్ చేస్తున్నట్టు పేర్కొన్నాయి. గత నవంబర్‌లో ఎర్రకోట వెలుపల జరిగిన కారుబాంబు పేలుడు ఘటన వెనుక జైషే మహ్మద్ ఉంది.కాగా, నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన అధికారులు జమ్మూకశ్మీర్, ఢిల్లీ, పంజాబ్ వంటి కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. అనుమానితుల పోస్టర్లను ఢిల్లీలో పలు చోట్ల ఏర్పాటు చేశారు. ప్రధానంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల్లో వీటిని ఉంచారు.గత ఏడాది ఏప్రిల్‌లో లష్కరే తొయిబా ఉగ్రసంస్థ పహల్గాంలో జరిపిన ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. గత వారం లష్కరే సంస్థ జమ్మూకశ్మీర్?లో ఉగ్రవాదానికి కట్టుబడి ఉన్నామని బహిరంగంగా ప్రకటించింది. హిందువులకు వ్యతిరేకంగా లష్కరే కమాండర్ విద్వేషపూరిత ప్రసంగం చేశాడు. హిందువుల కుత్తుకలు కోసినప్పుడే 'ఫ్రీడం' సాధ్యమని పీఓకేలో జరిగిన ఒక కార్యక్రమంలో అబూ మూసా కశ్మీరీ చేసిన ప్రసంగం వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా కశ్మీరీ ఇలాంటి వ్యాఖ్యలే చేశాడు. దీంతో భారత్?పై దాడులకు మరింత భారీ కుట్ర చేసే అవకాశాలు ఉండవచ్చని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.



# మున్సిపల్ ఎన్నికల ముందు

## ప్రభుత్వం కీలక నిర్ణయం

- ఏకంగా 47 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ
- ఆదేశాలు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్ :**తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు వేవంతం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను.. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్న ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగానే ఈ నిర్ణయం ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.మున్సిపల్ కమిషనర్ల బదిలీలకు సంబంధించిందిన జీవోను (నెం.87).. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి విడుదల చేశారు. ఒకే చోట సుదీర్ఘ కాలంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, తమ సొంత జిల్లాలో పనిచేస్తున్న వారు బదిలీ అయిన జాబితాలో ఉన్నారు. పరిపాలన కారణాలతో పాటు ప్రమోషన్ల వల్ల కూడా బదిలీ అయిన వారు ఈ లిస్ట్‌లో ఉన్నారు. కాగా, సీవీఎన్ రాజు ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ నుంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా ట్రాన్స్‌ఫర్ అయ్యారు.మరోవైపు, ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్?గా జి.రాజు క్యాతనపల్లిని ప్రభుత్వం నియమించింది. ముసాబ్ అహ్మద్‌ను నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ బదిలీ



చేసింది. బి శ్రీనివాస్ ఆలేరు నుంచి హుజూర్?నగర్ మున్సిపల్ కమిషనర్? బదిలీ అయ్యారు. డి జైత్రమ్ ప్రమోషన్ పొంది జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్? బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రమోషన్ పొందిన బి శరత్ చంద్ర నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్?గా వెళ్లనున్నారు.తాజాగా ట్రాన్స్‌ఫర్ అయిన అధికారులు వెంటనే తమను నియమించిన ప్రాంతాల్లో కొత్త బాధ్యతలు తీసుకోవాలని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్న నేపథ్యంలో.. విధుల్లో చేరడంలో నిర్లక్ష్యం వహిస్తే నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పింది.

### పొరుగు కాలేజీల్లో

## ఇంటర్ ప్రాక్టికల్స్

**హైదరాబాద్:** రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం గురుకుల విద్యార్థులకు శాపంగా మారింది. ప్రాక్టికల్? పరీక్షలకు పొరుగు కాలేజీల బాట పట్టాల్సిన దుస్థితి నెలకొన్నది. రాష్ట్రంలోని 80% ప్రభుత్వ గురుకులాల్లో ప్రాక్టికల్? పరీక్షల సెంటర్లను ఇంటర్? బోర్డు ఈ ఏడాది తొలగించడమే అందుకు కారణం. బోర్డు నిర్ణయంతో ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడనుండటంతోపాటు విద్యారు తప్పవని గురుకుల ఉద్యోగ వర్గాలు తెలుపుతు న్నాయి. సీసీ కెమెరాలు లేవనే సాకుతో బోర్డు తీసుకున్న ఈ నిర్ణయం దారుణమని విమర్శిస్తున్నాయి.రవాణా ఖర్చులతో సీసీ కెమెరాలనే ఏర్పాటు చేయవ చ్చని సూచిస్తు న్నారు. తక్షణం సర్కార్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్? చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్? అన్ని కలిపి 1,023 గురుకులాలు ఉన్నాయి. దాదాపు 900లకు పైగా గురుకులాల్లో ఇంటర్ వరకు విద్య అందిస్తున్నారు. ఈ ఏడాది కేవలం 20% గురుకులాలకే ప్రాక్టికల్ సెంటర్ నిర్వహ ఇంటర్‌బోర్డు అనుమతించింది. 80% గురుకులాలకు సెంటర్లు తొలగించింది.

### అన్నదాతలారా దయచేసి

## ధైర్యం కోల్పోకండి

**హైదరాబాద్ :** తెలంగాణలో ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత ఆందోళనకరమని బీఆరస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సమైక్యరాష్ట్ర ంనాటి సంక్షోభ పరిస్థితులు తెలంగాణ వ్యాప్తంగా నెలకొని ఉన్నాయనడానికి వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. ఆదిలాబాద్, మెదక్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ముగ్గురు రైతుల నిండు ప్రాణాలను పొట్టన పెట్టుకున్న పాపం ముమ్మాటికీ ఈ చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే అని మండిపడ్డారు.భూపాలపల్లిలో కోడెల సదానందం, మెదక్ లో దేవ్ సోత్ సర్వేశ్, ఆదిలాబాద్ లో జాదవ్ అంకుష్ కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే 25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ ముగ్గురు రైతుల ఆత్మహత్యలకు అప్పులే ప్రధాన కారణం కావడం, రేవంత్ సర్కారు మోసాలను, అబద్ధపు హామీల పేరిట చేసిన తీరని ద్రోహాన్ని అడుగడుగునా ఎత్తిచూపుతోందని అన్నారు. రుణమాఫీ పేరిట చేసిన నయవంచనకు తోడు, పెట్టుబడి సాయానికి పాతరేయడం, చివరికి యూరియాను కూడా ఎగ్గొట్టి దిగుబడిని దెబ్బతీయడంతో కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్నదాత పరిస్థితి అనాథలా మారిందని అన్నారు.కేవలం రెండేళ్ల కాలంలోనే దాదాపు 900 మంది రైతులు గుండెపగిలి బలవన్మరణాలకు పాల్పడినా ఈ సన్నాసి సర్కారుకు ఇప్పటికీ సోయి రాలేదని కేటీఆర్ మండిపడ్డారు. పదేళ్లు ధైర్యంగా బతికిన రైతు కుటుంబాల్లో ఇవాళ మోగుతున్న ఈ మరణమృదంగానికి రేవంత్ సర్కారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అన్నదాతలారా.. దయచేసి ధైర్యం కోల్పోకండి. మరో మూడేళ్లు ఓపిక పట్టండని సూచించారు. ఈ వ్యవసాయ వ్యతిరేక కాంగ్రెస్ పార్టీని, రైతు ద్రోహి రేవంత్ ను గద్దెదించుదామని.. మన తెలంగాణలో వ్యవసాయరంగానికి మళ్లీ మంచిరోజులు తెచ్చుకుందామని అన్నారు.



# ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడి చేయడమే ప్రజాపాలనా



**హైదరాబాద్ :**అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడిపై కాంగ్రెస్ సీనియర్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి దాడిని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. విజయుడిపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి దుర్భాషలాడుతూ చేయి చేసుకోవడం దారుణం, అప్రజాస్వామికమని విమర్శించారు. ప్రజల చేత ఎన్నిక కాబడిన ప్రతినిధిపై దాడి అంటే ప్రజల తీర్పుపైనే దాడి అని స్పష్టం చేశారు.విజయుడిపై ఎంపీ మల్లు రవి దాడిని బీఆరస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. మల్లు రవి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేను బెదిరించడం, దాడి చేయడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన మల్లు రవిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అసలేం జరిగిందంటే.మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పైపాడ్ గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్ అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. భూమిపూజ కార్యక్రమంలో మొదట ఎంపీ కొబ్బరికాయలు కొట్టగా తర్వాత ఎమ్మెల్యే పనులు ప్రారంభించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొబ్బరికాయ కొట్టేందుకు ముందుకురావడంతో ప్రొటోకాల్ లేని వ్యక్తులతో ఎలా కొట్టిస్తారని ఎంపీని, ఎమ్మెల్యే ప్రశ్నించారు. దీంతో రెచ్చిపోయిన మల్లు రవి 'ఎవడ్రా నువ్వు' అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. ఎమ్మెల్యే విజయుడును తోసేయడంతో పాటు అక్కడున్న వారితోనూ ఓ వీధి రౌడీలా ప్రవర్తించారు. దీంతో పోలీసులు ఎంపీని అదుపు చేశారు. సీనియర్ ఎంపీ రవి ఎమ్మెల్యేతో అమర్యాదగా మాట్లాడటాన్ని నియోజకవర్గ ప్రజలు తప్పుపడుతున్నారు. ఎంపీగా గెలిచినప్పటి నుంచి నడిగడ్డలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ అలజడి రేపుతున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తున్నారు. ఒకరు చేయి చేసుకోవడం సోషల్? మీడియాలో వైరల్ అయ్యింది

# సింగరేణిపై బీఆర్ఎస్ దుష్ప్రచారం

**హైదరాబాద్:** సింగరేణి గనుల కేటాయింపుల విషయంలో గత ప్రభుత్వ నేతలు చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. నిరాధారమైన విమర్శలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ నేతలు సింగరేణిపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.గత ప్రభుత్వ హయాంలో 21 గనులను కేటాయిస్తే, అందులో ఒక గనిని మైనస్?లో ఇచ్చారని, కానీ తమ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క గనిని కూడా మైనస్?లో ఇవ్వలేదని ఆయన వివరించారు. సింగరేణి అంశంపై తాము ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. గత పదేళ్లలో జరిగిన టెండర్ల కేటాయింపులపై విచారణకు సిద్ధమా అని బీఆర్?ఎస్ నేతలకు సవాలు విసిరారు. ముఖ్యంగా గత ప్రభుత్వం 30 శాతం అధిక ధరలకు టెండర్లను అప్పగించిందని, ఆ సమయంలో కాంట్రాక్టులు తీసుకున్న వారు ఇప్పుడు చెడ్డవాళ్లయ్యారా అని మంత్రి ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీష్ రావు నిజంగా పారదర్శకత కోరుకుంటే విచారణ చేయాలని కోరుతూ లేఖ రాయాలని సూచించారు.అసెంబ్లీలో హిల్ట్ పాలసీపై చర్చకు అవకాశం ఇస్తే బీఆర్?ఎస్ నేతలు పారిపోయారని, వారికి చర్చించే దమ్ము లేదని మంత్రి విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్, అవినీతిపై కల్వకుంట్ల కవిత అడిగిన ప్రశ్నలకు ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కేంద్ర ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నిస్తూ, బీజేపీ, బీఆర్?ఎస్ పార్టీలు లోపాయికారీ ఒప్పందంతో ఉన్నాయనే అనుమానం కలుగుతోందని అన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇక బీసీ రిజర్వేషన్ బిల్లు గురించి మాట్లాడుతూ, ఈ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద పెండింగ్?లో ఉందని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుకుంటే ఒక్క గంటలో దీన్ని అమలు చేయడం సాధ్యమవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



### భారత్, ఇజ్రాయెల్ ఆర్థిక సహకారానికి

## దావోస్ వేదిక

**అమరావతి/ దావోస్, జనవరి 21:** భారత్ - ఇజ్రాయెల్ ఆర్థిక సహకారానికి దావోస్ వేదికని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఏపీలో క్లీన్ - టెక్ పెట్టుబడులకు నూతన అవకాశాలున్నాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం దావోస్‌లో ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి నిర్ బార్కాట్‌తో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో పలు కీలక చర్చించామని చంద్రబాబు తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. రక్షణ, ఏరోస్పేస్, యూఏవీ రంగాల్లో భారత్ - ఇజ్రాయెల్ భాగస్వామ్యంపై చర్చించినట్లు తెలిపారు. అలాగే సెమీ కండక్టర్, క్వాంటమ్ టెక్నాలజీలో సహకార అవకాశాలతో పాటు నీటి శుద్ధి, భూగర్భ జలాల నాణ్యతపై ఇజ్రాయెల్ నైపుణ్యం, వినియోగంపైనా చర్చించినట్టు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.అదే విధంగా.. మెడికల్, విద్య, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో సంయుక్త కార్యక్రమాల రూపకల్పనపై చర్చించామని వివరించారు సీఎం చంద్రబాబు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్?లో ఇజ్రాయెల్ ఇండస్ట్రియల్ పార్క్ ప్రతిపాదన సహా ఏపీని మెడ్ - టెక్, ఏరో - డిఫెన్స్ హబ్‌గా అభివృద్ధి చేసే లక్ష్యం దిశగా అడుగులు పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అలాగే స్విట్జర్లాండ్?లో భారత రాయబారి మృదుల్ కుమార్? సైతం సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయనతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు నాయుడు వరుస భేటీలతో బిజీ బిజీగా ఉంటున్నారు. మంగళవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ భేటీలో ఆయనతో పలు కీలక అంశాలను చర్చించినట్లు సీఎం చంద్రబాబు తన ఎక్స్ ఖాతా వేదికగా వివరించిన విషయం విదితమే.



## కోతుల బెడదపై చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారికి చేగుంట పాలకవర్గం వినతి



**చేగుంట జనవరి 21 మెదక్ టుడే న్యూస్** చేగుంట గ్రామంలో కోతుల బెడద విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా ఉదయం స్కూల్?కు వెళ్లే విద్యార్థులు, మహిళలు, వృద్ధులు కోతుల దాడుల వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి బయటకు రావడమే కష్టంగా మారిందని వారు తెలిపారు.
ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ చేగుంట గ్రామపంచాయతీ సర్పంచ్ సంద్రగు స్రవంతి సతీష్, ఉప్ప సర్పంచ్ మహ్మద్ రఫీ, వార్డు సభ్యులు వంశీ, మహ్మద్ ఆరిఫ్, ఆకుల సుఖేందర్, కోయల్ కార్ రవి, తలారి లింగం, శ్రీనివాస్, కట్ట శ్రీనివాస్ గార్లు కలిసి మెదక్ జిల్లా అటవీ శాఖ అధికారి జోజీ గారికి వినతి పత్రం సమర్పించారు. ప్రజల అభిప్రాయంగ్రామస్థులు కోతుల బెడదను తగ్గించేందుకు అటవీ శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుందని వారు అన్నారు.

## గాండీవం" దినపత్రికను ఆవిష్కరించిన టీజీఐఐ సీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



**సంగారెడ్డి జిల్లా,జనవరి,21, మెదక్ టుడే న్యూస్:**
సంగారెడ్డి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా టీజీఐఐ సీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా గాండీవం దినపత్రిక ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా టీజీఐఐ సీ చైర్మన్ నిర్మల సమాజంలో మంచి వార్తలకు విలువల తో కూడిన వార్తలు ప్రచురించి సమాజానికి మంచి మెసేజ్ ఇవ్వాలని నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు. ముందుకు వెళుతున్న గాండీవం పత్రికకు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు తోపాజీ అనంతకిషన్, కూన సంతోష్ కిరణ్ గౌడ్, పలువురు కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు. పత్రికలో వస్తున్న వార్తలు వాస్తవానికి నిదర్శనంగా ఉండాలని నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## పదవ తరగతి మూల్యాంకన కేంద్రాన్ని మెదక్ లో ఏర్పాటు చేయాలని వినతి పత్రం



**చేగుంట జనవరి 21 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం లోని వడియారం రైల్వే స్టేషన్ లో రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగాపార్లమెంట్ సభ్యులు శ్రీ రఘునందన్ రావు కి పదవ తరగతి మూల్యాంకన కేంద్రాన్ని మెదక్ లో ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇచ్చిన తపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, జాల సిద్దు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దుబాషి భాస్కర్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్,రంగారెడ్డి ,మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు పట్లూరి యాదగిరి, బాలిశెట్టి రేఖ, సుమతి, మండల అధ్యక్షులు రావుల వెంకటేష్, మండల బాధ్యులు సరస్వతి, రాధా, విజయలత , తదితరులు పాల్గొన్నారు

## శ్వేతా కిరణ్ గౌడ్ ను సన్మానించిన పొన్నం అశోక్ గౌడ్



**మెదక్ జనవరి 21 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** తెలంగాణ బార్ కౌన్సిల్ ఎలక్షన్ ప్రచారంలో భాగంగా మెదక్ వచ్చిన పొన్నం అశోక్ గౌడ్ మెదక్ జిల్లా సర్పంచ్ ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ గా శ్వేతా కిరణ్ గౌడ్ ఎన్నికైందుకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో మెదక్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మార్కంటి రాములు సీనియర్ న్యాయవాదులు సుభాష్ గౌడ్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు .

# శాస్త్రీయంగా జంతుగణన

**నాలుగు ఏళ్లకు ఒకసారి జరిగే ఆల్ ఇండియా టైగర్ ఎస్టి మేషన్ ఐతే మెదక్ జిల్లా వ్యాప్తంగా అటవీ ప్రాంతాల్లో ముమ్మరంగా కొనసాగుతుంది**





**మెదక్.హవెలి ఘనపూర్ మండలం జనవరి 21 మెదక్ టుడే న్యూస్ ప్రతినిది** ఈ సందర్భంగా మెదక్ అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అటవీశాఖ అధికారి జోజీ తో కలిసి ఉదయం పోచారం అభయాఅరణ్యం కింద ఉన్న బూరుగుపల్లి అటవీ ప్రాంతంలో శాస్త్రీయ పద్ధతిలో జరుగుతున్న జంతు గణన ను పరిశీలించారు.మూడు రోజులపాటు మాంసాహార జంతువుల గణన తదనంతరం మరో మూడు రోజులపాటు శాకాహార జంతువుల గణన ఉంటుందని అదనపు కలెక్టర్ మేంచు నగేష్ తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి జోజీ మాట్లాడుతూ..మెదక్ జిల్లాలో ఆరు రేంజ్ లు, 98 బిట్ ల లో మాంసాహార జంతు గణన కొనసాగుతుందన్నారు.. చిరుత పులులు ఎలుగుబంటి, నిల్ గాయి, కొండ గొర్రె తదితర జంతువుల పాదముద్రలను విసర్జితలు,జంతువుల వెంట్రుకలు,గోళ్ళు, తదితరాలను ఏం స్ట్రిప్ట్ యాప్ లో నమోదు చేస్తున్నారాని తెలిపారు.
ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు, మెదక్ తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఆర్ ఐ లక్ష్మణ్, డి టి చరణ్, ఎఫ్ ఆర్ ఓ మనోజ్ కుమార్ , డి ఆర్ ఓ వేణు ,ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ ,అట్రాసిటీ కేసుల పరిష్కారం కోసం జిల్లాలో ఎస్సీ ,ఎస్టీ, అట్రాసిటీ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**







**మెదక్ జనవరి 21 మెదక్ టు డే న్యూస్ ప్రతినిధి**
బుధవారం జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మీటింగ్ సమావేశం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.
ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తో పాటు ,జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్ తోపాటు జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. కుల నిర్మూలన జరగాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పురోగతి సాధించాలని, బాధితులకు సత్వరమే పరిహారం అందించాలని, జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఫాస్ట్ ట్రాకోర్టును ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు.జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పురోగతికి చర్యలు చేపడుతున్నట్లు, బాధితులకు పోలీస్ శాఖ తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలియజేశారు. జిల్లాలో ఎస్సీ ,ఎస్టీ లలో అసైన్డ్ భూముల సమస్యలు పరిష్కరించాలని, జనవరి 26వ తేదీన అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాలని, బాధితులకు పరిహారం ఇవ్వడంలో ఆలస్యమైతుందని, ఎవరైనా బాధితుల పిల్లలు ఉంటే వారికి విద్య, వైద్యం అందించాలని, జిల్లాలో పౌర హక్కుల దినోత్సవం క్రమం తప్పకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ను జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర? భుజంగారావు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి,తూప్రాన్ ఆర్డీవో జయా చంద్రారెడ్డి, మెదక్ ఆర్డిఓ రమాదేవి, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## ప్రజల ఆశీస్సులతో కార్పొరేటర్ బరిలోకి: మాజీ కౌన్సిలర్ బోయిని బాలమణి బాలరాజ్

**అమీన్?పూర్ జనవరి : 21(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అమీన్?పూర్: "పదవులు మారినా.. హోదాలు పెరిగినా.. నా గమ్యం మాత్రం ప్రజాసేవే" అని 10వ వార్డు మాజీ కౌన్సిలర్ బోయిని బాలమణి బాలరాజ్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసే విషయంపై ఆమె స్పందిస్తూ, తన మనసులోని మాటను ప్రజలతో పంచుకున్నారు.గత 30 ఏళ్లుగా నేను మీ మధ్యే ఉంటున్నాను. అమీన్?పూర్ గ్రామ పంచాయతీగా ఉన్న రోజుల్లో వార్డు మెంబర్?గా, ఆ తర్వాత ఎంపీటీసీగా, మున్సిపాలిటీ అయిన తర్వాత కౌన్సిలర్?గా మీరు నాకు అవకాశం ఇచ్చారు. ఏ రోజూ మిమ్మల్ని విడిచి వెళ్లలేదు, మీ సమస్యను నా సమస్యగా భావించి పోరాడాను. రాజకీయాల్లో నేను గెలిచానంటే అది కేవలం నా గెలుపు కాదు.. అది మీ నమ్మకానికి దక్కిన విజయం.""నేడు అమీన్?పూర్, బీరంగూడ వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ అభివృద్ధిలో భాగస్వామిని



కావాలని, ప్రజలకు మరింత చేరువగా ఉండి సేవ చేయాలని ఉంది. ప్రజల ఆశీస్సులు, ఆ భగవంతుని దయ ఉంటే.. రాబోయే ఎన్నికల్లో బీరంగూడ (270) లేదా అమీన్?పూర్ (271) డివిజన్ నుండి కార్పొరేటర్ అభ్యర్థిగా మీ ముందుకు వస్తాను."అలుపెరుగని పోరాటం: మౌలిక సదుపాయాల కల్పనలో, స్థానిక సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందు వరుసలో నిలబడటం.ప్రజలతో అనుబంధం: 30 ఏళ్లుగా ఒక్క ఓటమి కూడా లేకుండా ప్రజల మద్దతును కూడగట్టుకోవడం ఆమె పనితీరుకు నిదర్శనం. భవిష్యత్తు ప్రణాళిక: కార్పొరేటర్?గా గెలిస్తే డివిజన్?ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు."రాజకీయం అంటే నాకు అధికారం కాదు.. అమీన్?పూర్ ప్రజల పట్ల ఉన్న బాధ్యత. రాబోయే రోజుల్లో కూడా మీ అందరి సహకారం ఉంటుందని ఆశిస్తున్నాను" అని ఆమె కోరారు.

## దక్షిణ భారత విజ్ఞాన ప్రదర్శనలో మేధోమథనం: కొల్లూరులో విద్యార్థుల భారీ సందడి



**రామచంద్రపురం జనవరి: 21 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా ఆర్.సి.పురం మండలం కొల్లూర్?లోని గౌడియం స్కూల్ క్యాంపస్ శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో మెరిసిపోతోంది. తెలంగాణ రాష్ట్ర ఎస్సీఈఆర్?టీ , వీఐటీఎం బెంగళూరు సంయుక్తంగా నిర్వహిస్తున్న దక్షిణ భారత విజ్ఞాన ప్రదర్శన--2026 (ఎస్ ఐ ఎస్ ఎఫ్) మూడో రోజున విద్యార్థుల మేధస్సుకు నిదర్శనంగా నిలిచింది.దక్షిణ భారతదేశంలోని ఆరు రాష్ట్రాల నుంచి వచ్చిన బాల శాస్త్రవేత్తలు తమ వినూత్న ఆలోచనలకు ప్రాణం పోశారు. సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్న కొన్ని కీలక ప్రాజెక్టులు:స్మార్ట్ దోమల నివారణ జాలం: తక్కువ ఖర్చుతో ఆరోగ్యాన్ని కాపాడే విధానం.ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం: ఏపీ విద్యార్థులు ప్రదర్శించిన సౌర విద్యుత్ నమూనా.బస్సుల్లో అగ్ని ప్రమాదాల నివారణ: సెన్సార్ల సహాయంతో ప్రమాదాలను ముందే పసిగట్టే సాంకేతికత.వ్యర్థాల నిర్వహణ: పాఠశాల స్థాయిలో చెత్తను సంపదగా మార్చే పద్ధతులు.బుధవారం




ఒక్కరోజే తెలంగాణలోని 7 జిల్లాల నుంచి సుమారు 187 పాఠశాలలకు చెందిన 10,173 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనను సందర్శించారు. విద్యార్థులతో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హాజరై ప్రాజెక్టుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రాజెక్టులను నిపుణులైన న్యాయనిర్ణేతలు నిశితంగా పరిశీలించి, శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగా మూల్యాంకనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్లలో విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు."ఈ ప్రదర్శనలు కేవలం నమూనాలు మాత్రమే కావు, వాస్తవ జీవిత సమస్యలకు విద్యార్థులు చూపుతున్న పరిష్కార మార్గాలు." అని ఒక సందర్శక ఉపాధ్యాయుడు కొనియాడారు.ఈ నెల 19న ప్రారంభమైన ఈ సంబరం జనవరి 23వ తేదీ వరకు కొనసాగనుంది. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మకతను పెంపొందించడమే ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను సమర్థవంతంగా సిద్ధం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఉపాధ్యాయులకు సూచించారు.





**మెదక్ జిల్లా రామాయంపేట మండలం జనవరి 21 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** రామాయంపేట పట్టణంలోనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలుర లో టెన్త్ క్లాస్ ప్రత్యేక తరగతులను కలెక్టర్ పరిశీలించారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచే లక్ష్యంతో, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి అదనపు తరగతులు నిర్వహించాలని తెలిపారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ వల్ల నాణ్యమైన విద్యను అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం కలెక్టర్ ఉపాధ్యాయుల బోధన శైలిని పరిశీలిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. గణితం, సైన్స్, ఇంగ్లీష్ వంటి ముఖ్యమైన సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు పెట్టాలని ఆదేశించడం జరిగిందని అన్నారు.ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలి: చేగుంట ఎంఈఓ నీరజ



**చేగుంట, జనవరి21 మెదక్ టుడే న్యూస్**
సోషల్ ఫోరం ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మండల స్థాయిలో సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పరీక్ష నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేగుంట మండల విద్యాధికారి శ్రీమతి నీరజ హాజరై.విద్యార్థులు సాంఘిక శాస్త్ర అధ్యయనం ద్వారా నైతిక విలువలుపెంపొందించుకుంటారని, 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట నరసింహారావు, రఘుపతి,చల్లా లక్ష్మణ్, యాదగిరి, రవిబాబు, పద్మ, రమ్య శ్రీ సురేష్, ఝాన్సీ, చేగుంట మండల సోషల్ ఫోరం కన్వీనర్ పెంటా గౌడ్ పాల్గొనడం జరిగింది. ఈ టాలెంట్ టెస్టులో తెలుగు మీడియంలో ప్రథమ,ద్వితీయ,తృతీయ గౌతమ్, విష్ణు, ఇందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరీంనగర్, ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ బహుమతి నాగ ప్రియ మోడల్ స్కూల్, ద్వితీయ, తృతీయ స్థానంలో భవాని, మయూరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వడియరం జిల్లా స్థాయికి ఎంపికయ్యారు వారికి మండల విద్యాధికారి నీరజ గారి చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది.

# అమీన్‌పూర్‌లో ఘనంగా శ్రీ మార్కండేయ మహర్షి జయంతోత్సవాలు

**- కుల బాంధవులంతా ఐక్యంగా సంఘాభివృద్ధికి తోడ్పడాలి: జిల్లా గౌరవ అధ్యక్షులు మాకం మల్లేష్**





**అమీన్‌పూర్ జనవరి : 21 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ పట్టణ మరియు మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ మార్కండేయ మహర్షి జయంతోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. సంఘం గౌరవ అధ్యక్షులు కోకల శ్రీనివాస్, మాకం మల్లేష్? నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పద్మశాలి కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఉత్సవాల్లో భాగంగా తొలుత స్థానిక శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ శ్రీ భావన ఋషి పద్మశాలి భవనం నందు మార్కండేయ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీ మాకం మల్లేష్ మాట్లాడుతూ.. పద్మశాలీయులు 'నాది, నేను' అనే స్వార్థ భావన వీడి, అందరూ కలిసికట్టుగా ఉండి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.గుర్తింపు అవసరం: ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు పద్మశాలీయుల సామాజిక ప్రాముఖ్యతను గుర్తించి సముచిత ప్రాధాన్యం కల్పించాలని కోరారు.రాబోయే కార్పొరేటర్ ఎన్నికల్లో పద్మశాలి అభ్యర్థులు చురుగ్గా ముందుకు రావాలని, వారిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు.ఈ కార్యక్రమంలో అమీన్?పూర్ పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి ఆనందపు మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుంట్ల యెల్లప్ప, ముఖ్య సలహాదారులు గోనె లింగం, మాజీ అధ్యక్షులు మసుర ఆగమయ్య, ఉపాధ్యక్షులు బామిని జోగినాథ్, బత్తుల కనకారావు, సంబారి నాగరాజు, ముంద్రాతి సురేష్, జిట్టె ఆనంద్, బెలూరి రాజ్ కుమార్, వనం రమేష్, కిషన్ రావు పాల్గొన్నారు. అలాగే యువజన సంఘం మాజీ అధ్యక్షులు భోగ రఘు, ప్రధాన కార్యదర్శి మాకం చంద్రశేఖర్ మరియు పెద్ద సంఖ్యలో కుల బాంధవులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అంతర్జాతీయ సదస్సులో గీతం వాణి

**- ప్రతిష్టాత్మక సదస్సులో కీలకోపన్యాసం చేసిన సీఎస అధ్యాపకురాలు ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్‌లి**



**పటాన్ చేరు జనవరి: 21(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**





గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని సీఎస విభాగం అధ్యాపకురాలు ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్స్ లో స్మార్ట్ ట్రెండ్స్ (స్మార్ట్ కామ్-2026) పదో అంతర్జాతీయ సమావేశం ప్రారంభోత్సవంలో అతిథిగా పాల్గొని, కీలకోపన్యాసం చేశారు. సమకాలీన పరిశోధన దిశ, కంప్యూటింగ్, కమ్యూనికేషన్ల డొమైన్ లలో ఇటీవలి సాంకేతిక పురోగతిపై విలువైన అంతర్దృష్టులను పంచుకున్నారు. ఆమె ప్రసంగం సదస్యుల మన్ననలను పొందింది. పూణే (మహారాష్ట్ర)లోని క్రౌన్ ప్లాజా సిటీ సెంటర్ లో హైబ్రిడ్ విధానంలో ఈనెల 19 నుంచి 21 వరకు నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమావేశంలో ప్రపంచ నలుమూలల నుంచి పలువురు ప్రొఫెసర్లు, నిపుణులు పాల్గొంటున్నారు. గ్లోబల్ నాలెడ్జ్ రీసెర్చ్ ఫౌండేషన్ (జీకేఆర?ఫ్), జీ.ఆర్. స్కాలస్టిక్ ఎలల్ పీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు నాలెడ్జ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జాతీయ ఛాంబర్ పార్టనర్ గా, స్ప్రింగర్ పబ్లికేషన్ పార్టనర్ గా వ్యవహరిసు్తన్నాయి .అత్యాధునిక పరిశోధన, ఇన్ఫర్మేషన్, కంప్యూటర్ కమ్యూనికేషన్స్ లో ఉద్భవిస్తున్న ధోరణులపై ఈ సమావేశం దృష్టి సారించింది. పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు తమ జ్ఞానం, ఆలోచనలను ఒకరితో మరొకరు పంచుకోవడానికి ఈ సదస్సు తోడ్పడుతోంది. దాదాపు 50కి పైగా దేశాల నుంచి 400కి పైగా పరిశోధనా పత్రాలను పరిశోధకులు సమర్పించారు.డాక్టర్ ప్రీతి విశిష్ట విద్యా నైపుణ్యం, పరిశోధన నాయకత్వం, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఉన్నత విద్యకు చేసిన గణనీయమైన కృషిని ఈ ప్రాతినిధ్యం ప్రతిబింబిస్తోంది.

# చేగుంట మండలం వడియారం రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభం





**చేగుంట జనవరి 21 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం వడియారం రైల్వే స్టేషన్?లో రైల్వే రిజర్వేషన్ కౌంటర్?ను మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూచేగుంట, నార్సింగి, వడియారం ప్రాంతాల్లో పరిశ్రమలు పెరుగుతున్న నేపథ్యంలో ఇక్కడి ప్రజలకు రైల్వే రిజర్వేషన్ కౌంటర్ అవసరం ఎంతో కాలంగా ఉందన్నారు. తాను దుబ్బాక ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచే ఈ డిమాండ్ కొనసాగుతుండగా, నేడు అది నెరవేరడం సంతోషకరమని తెలిపారు.ఈ రిజర్వేషన్ కౌంటర్ ద్వారా ఉత్తర భారతదేశానికి, ముఖ్యంగా బీహార్, మహారాష్ట్ర, ఒరిస్సా వంటి ప్రాంతాలకు వెళ్లే కూలీలు, ప్రయాణికులకు ఎంతో సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట మండల బిజెపి అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మాజీ అధ్యక్షుడు చింతల భూపాల్, చేగుంట సర్పంచ్ స్రవంతి సతీష్, ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ,కరణం గణేష్, వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచ్లు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగినది

# రాయసముద్రం చెరువు అభివృద్ధికి 'బి హెచ్ ఈ ఎల్' సహకారం కోరండి: హైడ్రా కమిషనర్‌కు వినతి

**- కమిషనర్ రంగనాథ్?ను కలిసిన కార్పొరేటర్ పుష్ప నగేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శశికళ**



**రామచంద్రపురం జనవరి : 21(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రపురం పట్టణంలోని రాయసముద్రం చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ రంగ సంస్థ అయిన బి హెచ్ ఈ ఎల్ యాజమాన్యాన్ని ఒప్పించాలని కోరుతూ బుధవారం హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్?కు వినతి పత్రం అందజేశారు. స్థానిక కార్పొరేటర్ పుష్ప నగేష్ మరియు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శశికళ యాదవ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రతినిధి బృందం కమిషనర్?ను కలిసింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్ప నగేష్ మాట్లాడుతూ.. రామచంద్రపురం పట్టణ ప్రజలకు రాయసముద్రం చెరువు ఒక ప్రధాన నీటి వనరుగా, ఆహ్లాదకర ప్రాంతంగా ఉందని పేర్కొన్నారు. ఈ చెరువును సమగ్రంగా అభివృద్ధి చేస్తే పట్టణ వాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.చెరువు అభివృద్ధి పనుల్లో బి హెచ్ ఈ ఎల్ సంస్థను భాగస్వాములను చేసేలా, వారి సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) నిధుల కింద అభివృద్ధికి సహకరించేలా ఆ సంస్థ యాజమాన్యంతో మాట్లాడాలని హైడ్రా కమిషనర్?ను కోరినట్లు తెలిపారు. చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ పనుల వల్ల స్థానిక పర్యావరణం మెరుగుపడుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్ రెడ్డి, వాసుదేవ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ టౌన్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమం

**- రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత**

**- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు**










**మెదక్ జనవరి 21 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
బుధవారం మెదక్ టౌన్‌లోని హెచ్. కన్వెన్షన్ హాల్?లో స్కూల్ మరియు కాలేజ్ విద్యార్థులకు భారీ ఎత్తున అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు మాట్లాడుతూ, నడిచేటప్పుడు, వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మోటార్ సైకిళ్ల ద్వారానే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, చిన్న చిన్న లోపాలను సరిదిద్దుకుంటే మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవచ్చని తెలిపారు. అందువల్ల రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ఐఎస్?ఐ మార్క్ ఉన్న హెల్మెట్ మాత్రమే వినియోగించాలని, హెల్మెట్ స్ట్రాప్?ను తప్పనిసరిగా పెట్టుకోవాలని తెలిపారు. హెల్మెట్ స్ట్రాప్ పెట్టుకోనట్లయితే హెల్మెట్?కు ఎలాంటి రక్షణ ప్రయోజనం ఉండదని చెప్పారు.సీట్?బెల్ట్ వినియోగం తప్పనిసరి అని, వేగ నియంత్రణ పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమని, ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు బయటకు వెళ్లే సమయంలో కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించాలన్నారు.చివరగా మెదక్ టౌన్ ఇన్?స్పెక్టర్ మహేష్ రోడ్డు భద్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ఆర్టీవో వెంకటస్వామి ఈఈ వేణు గారు, డీఎస్పీ ప్రసన్న కుమార్ మెదక్ టౌన్ సీఐ మహేష్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# తండ్లాడి తండ్లాడి



తుప్పురు తుప్పురుగా సురువైన వాన.. ముసురువట్టి నిలవడి కురుస్తంది. వాడకట్టోళ్లంతా ఒకలెనుక ఒకలు.. రాజీరు ఇంటికచ్చి, జరిగిన విషయం అడిగి తెలుసుకుని బాధ పడ్తంర్రు. ఒకామె అక్కడికి వచ్చుడుతోనే ఏడుపందుకున్నది. అది సూచిన బొందయ్య.."నీ ఏడ్పుడు సల్లగుండ. కాసేపు సైసరాదవ్వా!లోపలున్న ముసలాయన ఇంటే గుండె పల్గుతడు" అనంగనే..ఆమె దబ్బున కొంగును నోటికి అడ్డం పెట్టుకుని, నసుగుతున్నట్టుగా కాసేపు అట్లనే ఏడ్చి ఊకున్నది."అందరినుంర్డి. ఏడ్చుడు తూడ్చుడు కథ ఇప్పుడే మొదలువెట్టకుంర్డి. ముసలాయన పాణం అసలే బాగలేదు. అయిందేదో అయిపోయింది. ఉన్నొక్కన్ని నాలుగు రోజులు బతికిచ్చుకోవాల్నంటే మీ ఎగపోతను జరంతసేపు ఆపుకోంర్డి" అని, అక్కడున్నోళ్లందరిని బతిమాలినట్టుగ చెప్పిండు. బొందయ్య చెప్పింది విన్న అందరూ సప్పుడుజెయ్యకుంట గమ్మునైపోయింర్రు. ఇంతల ఛత్రీ నెత్తిన పెట్టుకుని పందిట్లకచ్చిన సామేలు, దాన్ని మడిచి ఓ మూలకువెట్టి.."ఈ వాన పాడుగాను! కొడితే లగాంచి దంచి కొట్టిందిగాదు, ల్యాకపోతే పురాంగ ఊకున్నదిగాదు, పండ్లపుల్ల నమిలెటోడు తుప్పతుప్ప ఊంచినట్లు ఏం తుప్పురు వానిది. ఏ పని చేసుకోనియ్యకుండా ముసురు ఇట్ల తగులుకున్నదేంరా! పురాంగ చీకటాయె. పోయినోళ్ల జాడేమైనా తెల్సిందా. బైలెల్లింర్రటనా?!".. అరుగుమీద పోచాలు పక్కన కూసుండుకుంట అడిగిండు."ఈ వానకగ్గిదల్గా! ఉండుండి ఇయ్యాల్నే కొట్టాల్నా?! గిది ఎప్పటిదాకుంటదోగానీ.. వాళ్లయితే అప్పుడే బయలెల్లింర్రంట. ఇంకో నాలుగైదు గంటల వరకు వస్తుండొచ్చు".. అంగిలకేంచి బీడీ తీసి ఎలిగించుకుంట చెప్పిండు పోచాలు."ఈ ముచ్చట ముసలోనికి తెల్సిందా?! ఎవలైన చెవులేసింర్డా?! కర్మ పాడుగాను.. ఎందుకైనా మంచిది, వాళ్లు వచ్చేలోపట ఏదన్న గింతంత తినవెట్టుంర్డి"విచారపడి, గలుమవంక సూసుకుంట, అక్కడున్నోళ్లకు ఇషారలెక్క చెప్పిండు సామేలు."రాజీరుకు ఇప్పుడే ఎట్లజెప్పుతరే! తెలిస్తే తట్టుకుంటడా?! ఇప్పుడప్పుడే చెప్పుడేంలేదు. ఎవ్వలు ఏడ్చేదిలేదు. రేపు కొడుకు, కోడలు, బిడ్డ, అల్లుడు వచ్చేదాక ఆగాలే! గిదే ముచ్చటను అందరు జరంత మదిలవెట్టుకుని మెదులుంర్డి" అని మల్లోమల్క చెప్పిన బొందయ్య, ఇంట్లకుజూసి."లోపల ఎవ్వలున్నరవ్వా.. ఏమన్న వండితే మిత్తమంత ముసలోనికి తినిపించుంర్డి"జరంత అరిసినట్టే చెప్పిండు."హా.. బాపూ! ఉన్నం ఉన్నం. లోపల సుధమ్మ ఉక్క, చాయ్? చేస్తంది"ఇంట్లనుంచి ఎవరో సమాధానం చెప్పింర్రు.రాజీరున్న గదిలకు పోవాల్నంటేనే బొందయ్య, సామేల్?కు ధైర్యం జాల్తలేదు. ఎళితే..'మా నర్సవ్వకు ఏమైంది? ఎట్లున్నది?' అని అడిగితే ఏం జెప్పాల్నో తెల్వక.. బయిటనే ఉండి చేతులు పిసుక్కుంటంర్రు. ఇంతల సుధమ్మ ఉక్క, చాయ్? తీస్కొని ఆడికొచ్చింది. బయిట గాబరా పడుతున్న వాళ్ల లెక్కనే, తన పరిస్థితి ఉన్నదనే విషయాన్ని బయిట పడనీయకుండా.. లోలోపల్నే ఆగమాగం అవుకుంటలోపలికివొయ్యి.."తాతా.. ఓ తాతా! లెవ్వే లెవ్వు" అనిచిన్నగ పిల్సింది.ఆ అలికిడికి.."అవ్వా! వచ్చినవా.. నీ బాంచెన్?!" అని మంచాన్ని పునుక్కుంట లేచి కూసున్నడు రాజీరు.కండ్లద్దాలు సర్దుకుంట.. 'అవ్వో.. వాయ్యో'..అని మూలుగుకుంట, ఎడమ కాలును సవరించుకొని కూసున్నడు."ఏమైంది బిడ్డా! అటే పోతివి"జరంత ఆయాసపడుకుంట అడిగిండు రాజీరు."ఇంట్ల పనుండెనే. అన్నీ సవరించి వచ్చేసరికి కొంచమంత ఆల్చమైంది. ఉడుకుడు ఉక్క, చాయ్? తెచ్చిన. తిను" అని ఉక్క పిలేటునందిచ్చిం.రాజీరు దాన్ని తీసుకుంట.."నీ తిండి పాడుగాను. నేను దీనికంటలేను. మీ అమ్మమ్మ ఎట్లున్నదట. ఏమైన మంచి చెడ్డ సంగతి తెలిసిందా!? ఎవ్వలు ఇటు దిక్కు వస్తనేలేరు. నాకు ఏ ముచ్చట చెప్తలేరు. దవఖాన్ల ఒక్కదాన్నే ఇడిసిపెట్టింర్డా. తోడెవలైన ఉన్నరా!?"సుధమ్మనే సూసుకుంట అడిగిండు. ఆయన మాటలు ఇనంగనే దుఃఖం ఆమె బొండిగలోకచ్చింది.కానీ, ఓర్సుకున్నది."మంచిగనే ఉన్నదట. పోన్? జేసి తెల్సుకున్నలే! నువ్వైతే తిను" అని చెప్పింది.బల్ల మీదున్న జగ్గులనుంచి నీళ్లను గిలాసలపోసుకుంట, ఓరకంట తాతనే గమనించుకుంట,కండ్లళ్ల తేలిన తడిని తుడ్చుకున్నది సుధమ్మ."అయ్యో తల్లీ! నీకెంత కష్టమొచ్చిందే.. నువ్వు మంచిగుండి, నేను దవఖాన్లవడ్డా బాగుండేది గదనే!" అని రాజీరు ఎక్కిళ్లు వెట్టుకున్నడు."ఏమన్న తింటందటనా?! డాక్టర్లు ఏమన్నరట?! ఈ కాలునొప్పి పాడుగాను. ఇది లేకుంటే నేనే ఎంబడుండేటోన్ని"అట్ల అనుకుంటనే, తన భార్యను గుర్తు చేసుకుని.. ఆమెకి తోడుగా ఉండలేదనే, తన చేతగాని తనాన్ని తిట్టుకున్నడు. "నువ్వైతే ముందు తిను. తర్వాత మాట్లాడుకుందం" అని రాజీరును మాటల్లవెట్టే దొరింపుజేసింది సుధమ్మ.

దాంతో ఉక్క ముద్దను నోట్లెవెట్టుకుని చప్పరించి, ముక్కిరిసిండు. చేతిలున్న కంచాన్ని సుధమ్మకు అందించి.."వద్దు బిడ్డా! ఎందుకో నోటికి సైసుతలేదు. చాయ్? బొట్టు తాగుతలే" అని చాయ్? గిలాసను తీసుకుని తాగసాగిండు.ఆ మాటలు ఇనంగనే గొల్లున ఏడవాల్నంత దుఃఖమొచ్చింది సుధమ్మకు.. అందుకనే అక్కడ ఉండలేక.. చీర కొంగును నోటికి అడ్డంబెట్టుకుని, ఏడుపుని బల్మీటికి ఆపుకొంట.. జప్పజప్ప నడుచుకుంట బయటికొచ్చింది.గది లోపల జరుగుతున్నదంత.. బయటనే ఉండి గమనిస్తున్న బొందయ్య, సామేల్?కు ఏం సమజ్? గాక, రువ్వడిగా సుధమ్మ వెనుకాల్నే నడిచింర్రు.ఇంటిముందట చేరిన వాళ్లంతా.. జరిగిన సంగతిని రాజీరుకు ఎట్లజెప్పాల్నో తెల్వక, ఎవలకు తోచినట్లు వాళ్లు మాట్లాడుకుంటుంర్రు.నువ్వు చెప్పమంటే , నువ్వే చెప్పాల్నాని అనుకుంట, పెద్దమనిషికి ఎవ్వలుగూడా చెప్పేటందుకు ధైర్యం చాలుతలేదు. ముసురువట్టిన వాన, చిన్నంగా వణుకుడు పుట్టిస్తుంటే.. వెచ్చబడేందుకు మొగోళ్లంతా బెల్ట్? దుఖాన్లకు వెళ్లి వస్తుంర్రు."మీరంతా ఓపారి నేను జెప్పేది జరంత ఇనుంర్డి. రాజీరుకు సెప్పుడు మనతోని కాదుగానీ.. కొడుకో కూతురో, లేకుంటే ఇంకెవలైన దగ్గరి చుట్టాలు వస్తే చెప్పిద్దాం. ఏమంటరు?" అని ఓ పెద్దమనిషి అడిగిండు.ఆ మాట సరింగనే ఉన్నదని అందరికీ అనిపించడంతో అట్లనే కానియ్యమన్నరు.

బయట ఏం జరుగుతందో తెల్వని రాజీరు జరంత కునుకేసిండు. ఏ రాత్రికో తెలివొచ్చి దిగ్గున కళ్లు తెరిచిండు. కట్టెలు, పిడికెలు కాలుతున్న కమురు వాసన ముక్కుకు తాకంగనే.. ఆ వాసనను రెండు మూడుసార్లు అనుమాన పడుకుంట పీల్చిండు. ఎందుకో గుండెల రాయి పడినంత అగులు బుగులైతుంటే.. ఏదో కీడు జరిగినట్లనిపించి మంచంలకేంచి మెల్లగ లేచిండు. పక్కనున్న చేతికర్రను అందుకొని దాని ఆసరాతోటి, తడుముకుంట లేచి నిలబడ్డడు. చేతి కర్ర సాయంతోని ఒంటికాలుమీద చిన్నగ గెంటుకుంట కిటికీ దగ్గరికెల్లి బయిటికి సూసిండు.ఇంటిముంగట పందిరికింద ఎలుతుర్ల మనుషులు కూసున్న ఆనవాళ్లు కనవడ్డది. ఆ పక్కన్నే మంటలకేంచి పొగచ్చుడు కనవడంగనే.. కళ్లద్దాలను సర్దుకుని మల్లోమల్క నిగురాంచి సూసిండు. అంతే.."ఓ అవ్వా.. నా నర్సవ్వ! మాయిల్లమే పోయినవానే.. నన్నాగంజేసి పోతివానే.. నన్నిడిసి నీకెట్ల పోబుద్దయ్యిందే నర్సవ్వా!" అని నెత్తి, చాతిల కొట్టుకుంట అరుపులు, కేకలు, పెడబొబ్బలతో ఏడుపందుకున్నడు. రాజీరు ఏడుపినంగనే, పందిట్లో ఉన్నోళ్లంతా దబ్బున ముందటి దర్వాజలకేంచి ఆయన గదిలకు ఉరికింర్రు.కిటికికాడ కింద కూలవడిపోయి పసిపోరనిలెక్క ఏడుస్తున్న రాజీరు దుఃఖాన్ని ఇనంగనే.. అప్పటిదాకా ఏడుపును ఉగ్గవట్టుకున్నోళ్లంతా కంటికి ధారాలువడ ఏడ్వసాగింర్రు.నర్సవ్వ తనని ఒంటరోన్నిజేసి, లోకాన్నిడిసి ఎల్లిపోయిన సంగతిని రాజీరు జీర్ణించుకోలేక పోతండు. ఇన్నేండ్లల్ల ఆమెతోటి నెరిపిన సంసార సాంగత్యాన్ని తల్సుకుంట నవిసినవిసి ఏడుస్తాంటే.. సూసెటోళ్లకు ఆయనను ఆపతరమైతలేదు.నెమ్మదిగా రాజీరును నర్సవ్వ పీనుగ కాడికి తీసుకుపోయింర్రు. ఆమెను చూడంగనే.."నా నర్సవ్వా.. నన్నిడిసి నీ జాగల నువ్వు పోయినవ్? గానీ, నా గతేంగానే అవ్వా! నా పిల్లలు, నా బిడ్డలని తెగ ఆరాట పడితివిగదనే నర్సవ్వా.. ఇప్పుడు ఏమక్కరకొచ్చింర్డే నా అవ్వా.. ఆళ్లను కంటాంగానీ, మన తలరాతను మార్చమని అడుగుతమానే నర్సవ్వా!" అని ఏడ్చుకుంటనే.."ఈ పిచ్చిది.. నా బిడ్డ, నా కొడుకని రందివెట్టుకునే, మనాదిలవడి రోగాలు తెచ్చుకుని చచ్చిపోయి, నన్ను ఒంటరోన్ని చేసిందయ్యా! దాని మట్టుకు అదెల్లిపోయింది గానీ, నన్నెట్లా మర్సిపోయిందోనయ్యా.." అని అందరినీ సూసుకుంట, గుక్క తిప్పుకోకుంట ఏడ్చిఏడ్చి నెరిగిలవడ్డడు. అదిజూసిన కొందరు దబ్బున ఆయనను లేవట్టి గడాంచల కూసోబెట్టి కొద్దిగన్ని నీళ్లు తాగిపించి పండబెట్టింర్రు.

రాజీరు, నర్సవ్వ.. ఆ వాడల అందరితోని కలుపుగోలుగా ఉండే ఆలుమగలు. వాళ్ల

# అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్










**మెదక్ జనవరి 21 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అరైవ్ అలైవ్ అనే కార్యక్రమాన్ని మెదక్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్టీవో వెంకటస్వామి, ఇ ఇ వేణు, డీఎస్పీ ప్రసన్న కుమారు హాజరయ్యారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ . ట్రాఫిక్ నియమాల అవగాహన ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపరదన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. దేశం అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో 4వ స్థానంలో ఉన్నప్పటికీ, రోడ్డు ప్రమాదాల్లో మొదటి స్థానంలో ఉండటం ఆందోళనకారం అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు ఎన్నో సంవత్సరాలుగా వారోత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రమాదాలు తగ్గడం లేదని పేర్కొన్నారు. అందుకే నెల రోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మీ ద్వారా తల్లిదండ్రులకు కూడా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులను సూచించారు.జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ..నడిచేటప్పుడు, వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని అన్నారు.మోటారు సైకిళ్ల ద్వారానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, చిన్న చిన్న లోపాలను సరిదిద్దుకొని మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని తెలిపారు. సక్రమంగా వెళ్లకపోవడం, అశ్రద్ధ, సెల్?ఫోన్ మాట్లాడుతూ నడవడం లేదా వాహనం నడపడం, జిగ్‌జాగ్‌గా వెళ్లడం, అతివేగం వంటి కారణాల వల్ల వాహనం నడిపే సమయంలో ధ్యాస లేక ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు.ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులచే రోడ్డు భద్రతా నియమాలపై ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు, మీడియా ప్రతినిధులు,విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీ తో పరికరాలు రైతన్నకు ఉపయోగం





**పాపన్నపేట, జనవరి 21 మెదక్ టుడే న్యూస్ :-**

2025–26 వ ఆర్థిక సంవత్సరానికి రాయితీపై వ్యవసాయ పరికరాలను లబ్ధిదారులకు అందజేయడానికి డ్రా పద్ధతి ద్వారా వారిని ఎంపిక చేసినట్టు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రాజు పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా నిర్వహించారు. పరికరాల పై 50 శాతం సబ్సిడీ ఉందని,త్వరలో అన్నదాత లకు పనిముట్లను అందజేస్తామన్నారు. ఎంపీడీవో విష్ణువర్ధన్,తహసీల్దార్ సతీష్ కుమార్,ఏఈవో లు అభిలాష్,నాగరాజు,ఆసిఫ్ ఉన్నారు.

# ఆదాయానికి మించి ఆస్తులు.. ఆ జిల్లా అదనపు కలెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు




**హన్మకొండ** అదనపు కలెక్టర్ వెంకట్?రెడ్డి నివాసాలు, కార్యాలయాలపై ఏసీబీ అధికారులు భారీ సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలతో హైదరాబాద్, వరంగల్, నల్గొండ సహా 10 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. గత నెలలో ఒక ప్రైవేట్ పాఠశాల అనుమతి కోసం రూ.60 వేలు లంచం తీసుకుంటూ వెంకట్?రెడ్డి రెడ్ హ్యాండెడ్?గా పట్టుబడటంతో ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. ఈ క్రమంలో ఆయన ఆస్తులపై నిఘా పెట్టిన అధికారులు.. వందల కోట్ల విలువైన అక్రమాస్తులు, బంగారం, నగదు మరియు కీలక పత్రాలను గుర్తించారు. తహసీల్దార్ స్థాయి నుంచి అదనపు కలెక్టర్ వరకు ఆయన సంపాదించిన బినామీ ఆస్తులపై ఏసీబీ ప్రస్తుతం లోతుగా దర్యాప్తు చేస్తోంది.హన్మకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్?రెడ్డి నివాసాలు, కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే పక్కా సమాచారంతో హైదరాబాద్, హన్మకొండ, నల్గొండ, మిర్యాలగూడలోని మొత్తం పది ప్రాంతాల్లో ఈ సోదాలు కొనసాగుతున్నాయివెంకట్?రెడ్డి గత నెలలో ఒక ప్రైవేట్ పాఠశాల గుర్తింపు పత్రాల పునరుద్ధరణ కోసం రూ. 60,000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్?గా పట్టుబడ్డారు. ఈ ఘటన తర్వాత ప్రభుత్వం ఆయనను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేసింది. అయితే.. లంచం తీసుకున్న సమయంలో ఆయన ఇంట్లో జరిపిన ప్రాథమిక తనిఖీల్లో భారీగా నగదు లభించడంతో.. అధికారులు ఆయన మొత్తం ఆస్తులపై దృష్టి సారించారు. ఆయన గతంలో నల్గొండ జిల్లాలో తహసీల్దార్?గా పనిచేసిన కాలం నుంచి అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ ప్రాథమికంగా నిర్ధారించింది.హైదరాబాద్?లోని మంచిరేవులలో ఉన్న ఆయన నివాసంతో పాటు బంధువుల ఇళ్లలో జరిపిన సోదాల్లో విలువైన ఆస్తుల పత్రాలు, బంగారం, నగదును అధికారులు గుర్తించారు. వందల కోట్ల విలువైన అక్రమాస్తులు ఉన్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో.. బ్యాంకు లాకర్లు, బినామీల పేరిట ఉన్న డాక్యుమెంట్లను ఏసీబీ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ప్రైవేట్ విద్యాసంస్థల అనుమతులు, భూముల రిజిస్ట్రేషన్లు మరియు రెవెన్యూ వ్యవహారాల్లో ఆయన పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలు లభ్యమవుతున్నాయి.ప్రస్తుతం సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. అధికారులు స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా వెంకట్?రెడ్డి బంధువులను కూడా విచారించే అవకాశం ఉంది. పూర్తిస్థాయి విచారణ అనంతరం ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల (ఔూ) కేసు కింద మరిన్ని కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ అక్రమ మార్గాల్లో వందల కోట్లు సంపాదించిన తీరు స్థానికంగా చర్చనీయాంశమైంది.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..